# ప్రజాజ్యోతి

నల్లగొండ-సూర్యాపేట
యాదాద్రి భువనగిరి

బుధవారం । 20 । మార్చి । 2024 పేజీలు: 9


## పంచాయతీ వారు పెంచారు...
## కరెంటోళ్ళు తెగ నరికారు

హరితహారం పేరిట లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి పెంచిన మొక్కలు ముందస్తు అంచనా లేకుండా...అనాలోచితంగా పంచాయతీ సిబ్బంది నాటారు... ఏపుగా పెరిగి, కాలుష్యాన్ని హరిస్తూ... నీడనిచ్చే వృక్షాలుగా మారిన వాటిని.... (మాన్ సూన్ మెయింటినేన్స్ )పేరిట కరెంటు తీగలకు అడ్డుపడుతున్నాయంటూ విద్యుత్ సిబ్బంది నిర్దాక్షిణ్యంగా నరికి వేస్తున్నారు... దశాబ్ద కాలంగా పెరిగిన వృక్షాలను నరికి వేయటం పై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



# వరికోత కష్టాలు...





గ్రామాల్లో వేధిస్తున్న కూలీల కొరత

యంత్రాలకు పెరిగిన అద్దె

సతమతమౌతున్న అన్నదాతలు

ఇతర రాష్ట్రాల నుంచి యంత్రాల రాక

హర్వెస్టర్ (ట్రాక్)యంత్రాలకు గంటకు రూ. 3వేలు ధర

నిడమానూరు, మార్చి19(ప్రజాజ్యోతి):రాష్ట్రంలో యిసంగి(రభీ)లో సాగుచేసిన వరి పంట కోతలు ముమ్మరమయ్యాయి. కూలీల కొరత నెలకొనడంతోపాటు కూలీ ధరలు అధికంగా ఉండటంతో రైతులు వరి కోతలకు హార్వెస్టర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే, డిమాండ్ కారణంగా యజమానులు వాటి అద్దె ధరలను కూడా పెంచేశారు. ఓ వైపు పెట్టుబడులు పెరిగి నష్టపోతుండగా.. మరోవైపు కోతల ధరలు పెరగడంతో తమ పరిస్థితి గోరుచుట్టు మీద రోకలిపోటులా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో యాసంగి సీజన్ లో సుమారు వేల ఎకరాల్లో వరి పంట సాగైయింది. వరి పంటలు గత పక్షం రోజుల నుంచి కోతలు మొదలైయ్యాయి. కూలీల కొరత, పెరిగిన కూలీల

..మిగతా 2లో



ఎక్కడైనా నగదు స్వాధీనం చేసుకున్నప్పుడు సంబంధిత పోలింగ్ స్టేషన్లో

# సీసీటీవీ కెమెరా నియంత్రణలో ఉంచాలి

2

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన

వాహనాల తనిఖీలో భాగంగా క్షుణ్ణంగా తనిఖీలు చేయాలి

ఎఫ్ ఎస్ టి బృందాలు ఒకే చోట ఉండకుండా క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలి

# ఎండలో బండి భద్రం

జాగ్రత్తలు తీసుకోకపోతే పమాదమే..

2





4

## భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కోమటిరెడ్డి లక్ష్మి...?

పలు సర్వేలలో కోమటిరెడ్డి లక్ష్మీ వైపే ప్రజల మొగ్గు...

గతంలో మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం హామీ...

మంత్రి లేదా...భువనగిరి ఎంపీ సీటు ఇవ్వాల్సిందే

పట్టుబట్టిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

## ఎక్కడైనా నగదు స్వాధీనం చేసుకున్నప్పుడు సంబంధిత పోలింగ్ స్టేషన్లో

# సీసీటీవీ కెమెరా నియంత్రణలో ఉంచాలి



నల్లగొండ మార్చి 19(ప్రజాజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి బృందాలు తనిఖీలను క్షుణ్ణంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన అన్నారు. మంగళవారం ఉదయాదిత్య భవన్లో ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి బృందాలకుద్దేశించి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎఫ్ ఎస్ టి బృందాలు ఒకే చోట ఉండకుండా క్షేత్రస్థాయిలో ఒక చోట నుండి మరోచోటికి వెళ్తూ తనిఖీలు నిర్వహించాలని, ముఖ్యంగా వాహనాల తనిఖీలలో భాగంగా అనుమతులు తీసుకున్నది, లేనిది, అదే విధంగా ర్యాలీల అనుమతులు, ఇతర అనుమతులను పరిశీలించాలని, వాహనాల తనిఖీలో భాగంగా క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని చెప్పారు. ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి బృందాల పైన ఎక్కువగా ఆధారపడి ఉంటుందని అన్నారు. అందువల్ల ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి బృందాలు తనిఖీలను జాగ్రత్తగా నిర్వహించాలని పునరుద్ఘాటించారు. ఎక్కడైనా నగదు స్వాధీనం చేసుకున్నప్పుడు సంబంధిత పోలింగ్ స్టేషన్లో సీసీటీవీ కెమెరా నియంత్రణలో ఉంచాలని , నగదు స్వాధీనం చేసుకున్న విషయాన్ని తక్షణమే జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీకి తెలియజేయాలని తెలిపారు. బృందాలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా చేయవలసిన పనులు, చేయకూడని వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, ఎలాంటి సందేహాలు లేకుండా విధులు నిర్వహించాలని చెప్పారు. జిల్లా ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ అనుమానం వచ్చినచోట ఎస్ ఎస్ టి బృందాలు మొత్తం సంఘటనను వీడియోగ్రఫీ చేయాలన్నారు. బృందాలు నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల విధులకు నియమించబడిన అన్ని బృందాలు చెక్ పోస్టులలో అందుబాటులో ఉండాలని తెలిపారు. ఒక్కోసారి ఎఫ్ఎస్ టి నివేదిక ఆధారంగానే ఎఫ్ఐఆర్ బుక్ చేయడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచందర్, డిఆర్ఓ డి. రాజ్యలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఏఆర్వోలు, ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి బృందాలు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# వరికోత కష్టాలు...

**మొదటి పేజీ తరువాయి...**

ధరల కారణంగా రైతులు ఎక్కువగా హార్వెస్టర్లతోనే పంట కోయిస్తున్నారు. గతంతో పోల్చితే హార్వెస్టర్ల యజమానులు వాటి అద్దె ధరలు పెంచేశారు. ప్రస్తుత సీజనులో వరి కోతకు గంటకు రూ.3 వేల నుంచి రూ.3,500 దాకా అద్దె వసూలు చేస్తున్నారు. గతేడాది వానాకాలంతో పోల్చితే గంటకు రూ.1000 నుంచి 1500 దాకా పెరిగిందని రైతులు వాపోతున్నారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో వరి కోతలు కోయడానికి కూలీలు దొరకడంలేదు. మరికొన్ని ప్రాంతాల్లో కోతలకు ఒక్కో కూలి రోజుకు రూ.500 నుంచి 800 వరకు అడుగుతున్నారు. మనుషులతో పంటను కోయిస్తే కూలీ ఖర్చు పెరగడంతోపాటు ఎక్కువ సమయం పట్టే అవకాశముండటంతో రైతులు హార్వెసర్లపైనే అధారపడుతున్నారు. డీజిల్ ధరలు, డ్రైవర్ల జీతాలు పెరగడంతో అద్దె పెంచకతప్పలేదని యంత్రాల యజమానులు చెబుతున్నారు.

**-రాష్ట్రంలో 10వేలకు పైగానే హార్వెస్టర్లు..**

కోతలు దాదాపు ఒకే సమయంలో మొదలై సుమారు 20-35 రోజుల వరకు కొనసాగుతాయి. రైతులు ఒక్కసారిగా కోతలు ప్రారంభిస్తుండటంతో డిమాండ్ పెరిగి యంత్రాల కొరత నెలకొంటుంది. దీంతో కొందరు ఆంధ్రప్రదేశ్,తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి హార్వెస్టర్లను తెప్పిస్తూ అధిక



ధరలకు అద్దెకు ఇస్తున్నారు. కేవలం తెలంగాణ రాష్ట్రంలోని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని నిడమానూరు,త్రిపురారం, అనుముల, తిరుమలగిరి (సాగర్) ,పెద్దవూర ,గుర్రంపోడు,మాడ్గులపల్లి, మిర్యాలగూడ,వేములపల్లి, దామరచర్ల,అడవిదేవులపల్లి, మండలాలల్లో ప్రస్తుతం ప్రతిరోజూ 70 -100వరకు యంత్రాలతో వరి కోతలు సాగుతున్నాయి. వీటిలో 50-60మాత్రమే నల్లగొండ జిల్లాకు చెందినవి. మిగిలిన హార్వెస్టర్లు ఇతర రాష్ట్రాల నుంచి రప్పించినవి . ప్రస్తుతం రాష్ట్రంలో 10 వేలకు పైగా యంత్రాలు వరి పంటలు కోస్తున్నట్లు అంచనా వేశారు.

**-'సేవా కేంద్రం'పై పట్టింపేదీ..**

ఒక్కో హార్వెస్టరు ధర ధర రూ. 20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉంటుంది. వీటి కొనుగోలు సాధారణ రైతులకు భారమే. దీన్ని దృష్టిలో ఉంచుకున్న కేంద్ర ప్రభుత్వం.. గ్రామాల్లో 'యంత్రాల సేవా కేంద్రం' ఏర్పాటు చేసి యంత్రాలను తక్కువ అద్దెకు ఇచ్చేలా చూడాలని అన్ని రాష్ట్రాలకు సూచించింది. గుజరాత్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటవుతున్నా తెలంగాణలో మాత్రం వాటి గురించి రాష్ట్ర వ్యవసాయ శాఖ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం యంత్రలక్ష్మి పథకాన్ని నిలిపేయడంతో రైతులకు రాయితీ యంత్రాలను ఇవ్వలేకపోతున్నామని వ్యవసాయ అధికారులు వ్యాఖ్యానించారు.

**-ఒక ఎకరం కోతకు రూ.3వేలు..**

నందికొండ లింగారెడ్డి, రైతు, నందికొండ వారిగూడెం గ్రామం, నల్లగొండ జిల్లా

ఆరు ఎకరాల్లో వరి సాగు చేశా. హార్వెస్టరుకు ఎకరాకు రూ.3వేలు చొప్పున అద్దె చెల్లించి పంట కోయించా. పొలంలో బురద ఉంటే వాటి 4వీల్ యంత్రాల యజమానులు ఎకరానికి రూ.3వేల నుంచి రూ.3500 వేల వరకు పైగా వసూలు చేస్తున్నారు. గతేడాది ఎకరా కోతకు రూ.2000 ఉండగా ఈ ఏడు రూ.500 -1000వరకు అదనంగా పెంచారు. దీనికితోడు ధాన్యాన్ని ట్రాక్టరులో పొలం నుంచి ఇంటికి తరలించడానికి ఒక్కో ట్రిప్పునకు రూ.700 చొప్పున చెల్లించుస్తున్నాము.సాగు ఖర్చులు బాగా పెరిగినా ధాన్యం ధర మాత్రం పెంచడం లేదు. ప్రభుత్వం గిట్టుబాటు ధర పెంచి ఆదుకోవాలి.

## మహిళ సహకార అభివృద్ధి సంస్థ కార్పోరేషన్ చైర్మన్ ను సన్మానించిన సిపిఆర్ఓ



తుర్కపల్లి మండలం, మార్చి19(ప్రజాజ్యోతి ): తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిపిఆర్ఓ రెడ్డి అయోధ్య రెడ్డి నీ మంగళవారం తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ కార్పోరేషన్ చైర్మన్ బండ్లు శోభారాణి కలిశారు .ఈ సందర్భంగా సీఎం సిపిఆర్ఓ అయోధ్య రెడ్డి దంపతులు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు

## గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మిర్యాలగూడ, మార్చి 19, ( ప్రజా జ్యోతి ): మిర్యాలగూడ మండలంలోని కిష్టాపురం శివారు అద్దంకి- నార్కట్ పల్లి రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని భూక్య నాగు నాయక్ (22) మృతి చెందగా, రత్నావత్ దావీద్ తీవ్ర గాయాలపాలయ్యడు. రూరల్ ఎస్సై కే నరేష్ తెలిపిన వివరాల ప్రకారం. దామరచర్ల మండలం లావూరిబిక్యా తండా కు చెందిన మృతుడు నాగు నాయక్ శుభకార్యాలకు డెకరేషన్ పనులు నిర్వహిస్తూ ఉంటాడని, అతని వద్ద సహాయకుడిగా బాలాజీ నగర్ తండా కు చెందిన స్నేహితుడు దావీదు పనిచేస్తూ ఉంటాడు. డెకరేషన్ సామాను కోసం సోమవారం మిర్యాలగూడ వెళ్లి తిరిగి రాత్రి బైక్ పై ఇంటికి వెళు తుండగా కిష్టాపురం సమీపంలో గుర్తుతెలియని వాహనం వెనుక నుండి బలంగా వారిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో నాగు నాయక్ అక్కడికక్కడే మృతిచెందగా, దావీదును మెరుగైన చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. మృతుని బావ ధరావత్ సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. చేతికి అంది వచ్చిన ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టిస్తుంది.

# ఎండలో బండి భద్రం...



**-జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదమే..**

నిడమనూరు,మార్చి19(ప్రజాజ్యోతి): ఎండ తీవ్రత పెరిగిపోయింది. భానుడు భగ్గున మండిపోతున్నాడు. ఎక్కడ చూసినా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ఉదయం పది దాటితే ప్రజలు బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కనీస జాగ్రత్తలు పాటించకుండా బయటకు వస్తే అంతే సంగతులు. ఈ ఎండలతో మనుషులకే కాదు వాహనాలకు గడ్డు కాలమే. ప్రజలు తమ బండ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వాహనాలు ఎండలో గంటల సమయం ఉంటే పేలిపోయే అవకాశం ఉంది. గతంలో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా వైరా రోడ్డులో ద్విచక్ర వాహనం పేలి మంటలు ఎగిసిపడి కాలిపోయిన విషయం పాఠకులకు తెలిసిందే.

**-ఫుల్ ట్యాంక్ చేస్తే..**

ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ద్విచక్ర వాహనాలకు ఫుల్ ట్యాంక్ చేయించడం వల్ల పేలిపోయే ప్రమాదం ఉందని ఇటీవల ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఎండీ స్వయానా వెల్లడించారు. ఒకవేళ ద్విచక్ర వాహనాన్ని ఎండలో పెట్టాల్సి వస్తే ఏదైనా పొడవాటి క్లాతు ట్యాంకుపై కప్పి ఉంచితే సరిపోతుంది. లేదంటే ఎండ వేడికి పెట్రోల్ ట్యాంక్ పేలిపోయే ప్రమాదం ఉంది. అదే విధంగా పెట్రోల్ ఆవిరి అయ్యే అవకాశం కూడా ఉంది.

**-దూర ప్రయాణాలు తగ్గించుకుంటే మేలు..**

ఎండలకు దూర ప్రయాణాలు తగ్గించుకుంటేనే మేలు అని చెప్పవచ్చు. ఒకవేళ తప్పక వెళ్లాల్సి వస్తే

కొంత దూరం ప్రయాణం చేసిన తర్వాత ఇంజిన్ కాసేపు ఆపితే మంచిది. మండుతున్న ఎండల్లో నిరంతరంగా ప్రయాణం చేస్తే వాహనం ఇంజిన్ వేడెక్కి దెబ్బతినవచ్చు. లేదంటే ఒక్కోసారి పొగలు.వచ్చి పేలే అవకాశం ఉంటుంది.

**-తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

-వాహనాలను ఎక్కువ సేపు ఎండలో ఉంచకూడదు. అలా ఉంచితే పెట్రోల్ ఆవిరైపోతుంది. రంగు సైతం వెలిసిపోతుంది. సాధ్యమైనంత వరకు నీడలోనే ఉండాలి..

-వాహనాలు ఎక్కువ సేపు పార్కింగ్ చేయాల్సి వస్తే చెట్టు నీడన లేదా షెడ్ల లేదా కవర్లు కప్పి ఉంచాలి.

-టైర్లలో గాలి ఎప్పటికప్పుడు చూసుకోవాలి. అధిక వేడి వల్ల గాలి తగ్గిపోతుంది. అదే పనిగా వాహనాలను నడిపితే టైర్ల మన్నిక తగ్గుతుంది.

-వేసవిలో పెట్రోల్ ట్యాంక్లో గ్యాస్ ఏర్పడే అవకాశం ఉంటుంది. రాత్రి సమయంలో బైకు పార్కింగ్ చేసినప్పుడు ఒకసారి ట్యాంక్ మూతను తెరిచి మూయాలి.

-ఎండ వేడికి ఇంజిన్ ఆయిల్ కూడా త్వరగా పల్చబడుతుంది. నిర్ణీత సమయానికి ఇంజిన్ ఆయిల్ మార్చుకోవడం మంచిది.

# యాద్గార్ పల్లి లో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

**ఓటు హక్కు పై అవగాహన ర్యాలీ,వైద్య శిబిరం ఏర్పాటు**







మిర్యాలగూడ, మార్చి 19, ( ప్రజా జ్యోతి ): కె ఎన్ ఎమ్ డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులలు శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా ఐదవ రోజైన మంగళవారం మిర్యాలగూడ మండలం లోని యాద్గార్ పల్లి లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిక్షమయ్య అధ్యక్షతన ఓటు హక్కు పై వినియోగంపై అవగాహన కల్పిస్తూ,స్లొగన్స్ ఇస్తూ ప్రజలను చైతన్యపరచడానికి గ్రామంలో ర్యాలీ తీశారు. ఈరోజు నేషనల్ హెల్త్ స్కీమ్ వైద్య బృందం, జ్యోతి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో 70 మందికి వైద్య పరీక్షలు,రక్త పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రతి ఒక్కరికి తమ బ్లడ్ గ్రూప్ తెలవాలని అన్నారు. ఆపద సమయంలో తమ బ్లడ్ గ్రూప్ తెలిసినా,ఇతరుల బ్లడ్ గ్రూప్ తెలిసినా ఆపదలో ఉండి రక్తం అవసరమైన వారికి రక్తదానం చేయొచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్ కోటయ్య, ప్రధానోపాధ్యాయులు యమ్ వెంకటేశ్వర్లు,గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్, డాక్టర్ టి రవి, జ్యోతి బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్స్ ఎం సైదులు , యస్ కె జాఫర్, ఫార్మసిస్ట్ శైలజ, ఏఎన్ఎం అంజమ్మ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ , తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో మహిళలు ఉద్యమించాలి

**ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ**




భువనగిరి,మార్చ్ 19 (ప్రజాజ్యోతి) వీరనారి మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో ప్రభుత్వాలు అవలంబించే,మహిళా వ్యతిరేక విధానాలపై ఉద్య మించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ అన్నారు.తెలంగాణ సాయుధ పోరాట,యోధురాలు మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి ఐద్వా జిల్లా కమిటీఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో బహార్పేటలో నిర్వహించి, పూలమాల వేసి జోహార్లు అర్పించి,మాట్లా డుతూ భూమి,భుక్తి,వెట్టి చాకిరి విముక్తి కోసం అలు పెరుగని పోరాటం చేసి నైజాం నిరంకుశ, విధానాలను గెరిల్లా యుద్ధ వ్యూహంతో పోరాడిన వీర వనిత మల్లు స్వరాజ్యం అన్నారు.స్వాతంత్ర అనంతరం ప్రభుత్వాలు అవలంబించే విధానాలపై పోరాడి మహిళా హక్కుల కోసం చట్టసభల్లో నినదించిం దన్నారు. మహిళలను చైతన్యం చేసిందన్నారు.మహిళలకు బస్సులో సీట్లు కావాలని, మద్యం వ్యతిరేకంగా లక్షలాది మహిళలను చైతన్యం చేసిందన్నారు.మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు దండు స్వరూపం, ఐద్వా పట్టణ నాయకురాలు ఉదయగిరి సుజాత,బి.భావన బి.రమ్యకె.అనిత,కె.లక్ష్మి, జయశ్రీ, బి.లక్ష్మి,సాలమ్మ, రామలక్ష్మి, చున్నూ, నాగరాణి, నవ్య తదితరులు పాల్గొన్నారు.

# నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరణ



కొండ మల్లేపల్లి మార్చి 19 ప్రజా జ్యోతి: కొండమల్లేపల్లి మండల నూతన తహసీల్దార్‌గా అనురాధ మంగళవారం బాధ్యతలను చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన దివ్య రెడ్డి హైదరాబాద్ కు బదిలీపై వెళ్లగా , హైదరాబాదులో పనిచేసిన అనురాధ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కులం ఆదాయ ధ్రువ పత్రాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేసి మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు.సిబ్బంది అందరూ తమ విధుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు.






# సుంకిశాల అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు

నాంపల్లి,మార్చి,19(ప్రజా జ్యోతి):పోషణ పక్షంలో భాగంగా నాంపల్లి మండలంలోని సుంకిశాల గ్రామంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. తల్లులకు పోషకాహారం ఐ వై సి ఎఫ్ పద్ధతులు చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి ప్లాస్టిక్ నిషేధం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం మరుగుదొడ్లు ఉపయోగించడం మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రాంతీయ వంటలు ఉపయోగాల గురించి తెలిపారు. ప్రీస్కూల్ ప్రాముఖ్యత అలాగే ఆట,పాట కథ ప్రాముఖ్యత గురించి వివరించారు .బయటి ఆటలు లోపలి ఆటల వలన సూక్ష్మ కండరాల స్థూల కండరాల అభివృద్ధి చెందడం మరియు మేధోశక్తి పెరగడం ఇవన్నీ అంగన్వాడి స్కూల్ లోనే సాధ్యమవుతాయని వివరించారు. ప్రైవేటు స్కూలుకు దీటుగా నర్సరీ, ఎల్కేజీ ,యూకేజీ, విద్యను బోధించడం, పౌష్టికహారం అందించడం తల్లులకు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడం బిడ్డ యొక్క పోషణ స్థితిని అంచనా వేయడం లోప పోషణకు గురైన పిల్లల తల్లులకు సరియైన పోషణ పద్ధతులు తెలిపారు. ఆరోగ్య సలహాలు సూచనలు ఇవన్నీ కేవలం అంగన్వాడీలోనే సాధ్యం అన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని బండ తిమ్మాపురం, పాటిమీదిగూడెం, రాజ్య తండా, మురికి తండా, రత్య తండా, గ్రామాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ శశికళ,అంగన్వాడి టీచర్లు ఎడమ సుమతమ్మ, సునీత, భాగ్యమ్మ, నాగమణి, భారతి, సరస్వతి, ఆయమ్మలు, పూలమ్మ, ధనమ్మ, గ్రామ పెద్దలు, తల్లులు,తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ మహిళా అధ్యక్షురాలుగా కోడిరెక్క శైలజ

మిర్యాలగూడ, మార్చి 19, ( ప్రజా జ్యోతి ) : తెలంగాణ పంచాయతీ సెక్రెటరీ ఫెడరేషన్ నూతన జిల్లా కమిటీని మంగళవారం ఎన్నుకోగా జిల్లా మహిళా అధ్యక్షురాలిగా బాదలాపురం పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న కోడి రెక్క శైలజ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ ఏళ్లతరబడి పరిష్కారానికి నోచుకోని

పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. కార్యదర్శుల ప్రొబేషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణించాలని,ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను తక్షణమే రెగ్యులర్ చేస్తూ, ఒపీఎస్ వ్యవస్థని రద్దు చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శుల వ్యవస్థని రెండు గ్రేడ్లుగా విభజించాలని,ప్రభుత్వం ప్రకటించిన పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించిన అన్ని అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.తన ఎన్నికకు సహకరించిన జిల్లా వ్యాప్తంగా వున్న కార్యదర్శులకు, నూతన కమిటీ జిల్లాఅధ్యక్ష,కార్యదర్శులకు, ఉపాధ్యక్షులు ధన్యవాదాలు తెలియజేశారు.

# రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు సంతోషదాయకం

**రెడ్డి జేఏసీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కర్ణాటి తరుణ్ రెడ్డి**



మఠంపల్లి మార్చి 19 ప్రజా జ్యోతి: మఠంపల్లి మండల కేంద్రంలో సూర్యాపేట జిల్లా రెడ్డి జేఏసీ యువజన విభాగం అధ్యక్షుడు కర్నాటి తరుణ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకమని,కార్పొరేషన్ ఏర్పాటుకు కృషిచేసిన సీఎం రేవంత్ రెడ్డికి రెడ్డి సంఘం సభ్యులందరి తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయటం వలన పేద రెడ్డిల మరియు మధ్య తరగతి కుటుంబాలకు సంబంధించినటువంటి వారి యొక్క అభ్యున్నతికి ఎంతో దోహదపడుతుందని ఈ రెడ్డి కార్పొరేషన్ యొక్క చైర్మన్ పదవిని రెడ్డి ల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన రెడ్డి సంఘం నాయకులకు కేటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్డి జేఏసీ యువజన విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

**సిఐటియు జిల్లా నాయకులు యాకూబ్**

గరిడేపల్లి మార్చి 19(ప్రజా జ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా నాయకులు యాకూబ్ డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పోనుగొడు గ్రామపంచాయతీలో గ్రామ కార్యదర్శికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సంవత్సరాల తరబడి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న కార్మికుల సమస్యలు ఎక్కడేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. అర్హులైన వారిని పంచాయతీ



కార్యదర్శులుగా నియమించి,ఉద్యోగ భద్రతనిస్తూ పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీలలో మూడు,నాలుగు నెలలు కొన్ని గ్రామ పంచాయతీలో తొమ్మిది నెలలుగా వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని,సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని ఈ పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, సత్యం,నాగరాజు,బాలకృష్ణ, హరీష్, వీరాస్వామి,సైదులు తదితరులు పాల్గొన్నారు.

## మాతృవియోగం చెందిన జర్నలిస్ట్ కుటుంబాన్ని పరామర్శించిన కారింగుల అంజన్ గౌడ్

కోదాడ టౌన్ మార్చి 19( ప్రజా జ్యోతి): సీనియర్ జర్నలిస్టు రామకృష్ణకు(ఆర్కే) మాతృమూర్తి మంగళవారం అనారోగ్యంతో కన్నుమూశారు విషయం తెలుసుకున్న %ఖఔజీ ఎ%143 జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంజన్ గౌడ్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరికిషన్,మరియు ఎలక్ట్రానిక్ మీడియా నియోజకవర్గ అధ్యక్షులు పడిశాల రఘు.. కోదాడ పట్టణంలో రామక్రిష్ణ నివాసానికి చేరుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి, వారి ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు,

ఈ సందర్భంగా అంజన్ గౌడ్ మాట్లాడుతూ.. సీనియర్ పాత్రికేయులు వార్త విలేకరి రామకృష్ణ మాతృమూర్తి మృతి చెందడం చాలా బాధాకరమని అలాగే రామకృష్ణకు జర్నలిస్టులంతా అండగా ఉంటారని ఈ సందర్భంగా గుర్తు చేశారు, అనంతరం రామక్రిష్ణ అమ్మగారి పార్టీవ దేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు, ఈ కార్యక్రమంలో, సీనియర్ జర్నలిస్టులు కోట రాంబాబు, సోమపంగు గణేష్,మకిరికంటి లక్ష్మణ్ , తంగేళ్లపల్లి లక్ష్మణ్ మరియు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పిడమర్తి గాంధీ, ఎలక్ట్రానిక్ మీడియా కోశాధికారి చీమ చంద్రశేఖర్, నజీర్, మాతంగి సైదులు, లింగయ్య, రాయల వెంకన్న, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# మల్లు స్వరాజ్యంఆశయ సాధనకై కృషి చేయాలి

**కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దేవరకొండ యాదగిరి**



నాగారం మార్చి 19 ప్రజా జ్యోతి. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యేమల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దేవరకొండ యాదగిరి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో జరిగిన వీర తెలంగాణ సాయుధ పోరాటంలో మల్లు స్వరాజ్యం కీలక భూమిక పోషించిందన్నారు. భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసంతుపాకీ చేతబట్టి దొరలు, భూస్వాములు, దేశముక్కులకు వ్యతిరేకంగా పోరాటం చేశారని అన్నారు. తన జీవితాంతంప్రజల కోసం పార్టీ కోసం పనిచేశారని అన్నారు. రెండుసార్లు శాసనసభ్యులుగా ఎన్నికై శాసనసభలో ప్రజా సమస్యలపై ప్రశ్నించారని అన్నారు. మహిళల హక్కులకై శాసనసభలో బయట అనేక ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన సారా వ్యతిరేక ఉద్యమంలో చురుకుగా పాల్గొని మద్యపాన నిషేధం బంద్ అయ్యేంతవరకు పోరాటం చేశారని అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా సమగ్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. మల్లు స్వరాజ్యం జీవితాన్ని స్ఫూర్తిగా నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలోవెంకటమ్మ,సృజన, మాణిక్యమ్మ, సుజాత, ప్రమీల, కవిత తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ నవభారత్ డిగ్రీ, పీజి కళాశాలలో సివిల్ సర్వీసెస్ పై అవగాహన సదస్సు

భువనగిరి,మార్చ్ 19 (ప్రజాజ్యోతి): భువనగిరి పట్టణం లోని శ్రీ నవభారత్ డిగ్రీ %డ%పీజీ కళాశాల సెమినార్ హాల్లో హైదరాబాద్,కు చెందిన శంకర్ ఐ ఏ ఎస్,అకాడమీ హెడ్ ఆఫ్ ది బ్రాంచ్,చైతన్య,మరియు ఫ్యాకల్టీ,సాయి ప్రశాంత్ చే విద్యార్థులకు,భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్,ప్రిపరేషన్ కు కావలసి నటువంటి, ముఖ్యమైన విషయాలను విద్యార్థుల కు వివరించడం జరిగింది.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చిక్కా ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ,తమ కళాశాల విద్యార్థులకు భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్ లో ఉన్నత ర్యాంక్ లు ఎలా సాధించాలి అనే అంశం పై పలు సూచనలు సలహాలు,ఇవ్వడం జరిగింది. అలాగే విద్యార్థులు కష్టపడి కాకుండ,ఇష్టపడి చదివితేనే రాబోయే రోజుల్లోఐ ఏ ఎస్,ఐ పీ ఎస్,ఐ ఎఫ్ ఎస్ కావొచ్చు అని తెలపడం జరిగింది. మనం తల్చుకుంటే దేన్నైనా,సాధించగలం అని నమ్మకం పట్టుదల ఉంటే అన్నింటిని అధిగమించి విజయం సాధిస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల విద్యార్థులు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



## భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కోమటిరెడ్డి లక్ష్మి...?

**పలు సర్వేలలో కోమటిరెడ్డి లక్ష్మీ వైపే ప్రజల మొగ్గు...**
**గతంలో మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం హామీ...**
**మంత్రి లేదా...భువనగిరి ఎంపీ సీటు ఇవ్వాల్సిందే**
**పట్టుబట్టిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



సంస్థాన్ నారాయణపురం, మార్చు 19, (ప్రజాజ్యోతి) : రాష్ట్రంలో త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలలో ఎంపీ సీట్ల కసరత్తులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాంగ్రెస్ నాయకుడు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అధిష్టానం గతంలో ఇచ్చిన హామీ మేరకు తనకు మంత్రి పదవి అయినా ఇవ్వాలి లేదంటే తన భార్య కోమటిరెడ్డి లక్ష్మికి భువనగిరి ఎంపీ సీటు అయినా ఇవ్వాలని అధిష్టానం వద్ద పట్టుబట్టినట్టు తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీ సలహాదారు సునీల్ కనుగోలు చేసిన సర్వే, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంతంగా చేయించిన సర్వేలలోనూ భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా కోమటిరెడ్డి లక్ష్మి వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా ప్రధాని మోడీ గాలి వీస్తుండడంతో భువనగిరి లోను మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ను గెలిపించాలని పట్టుదలతో బిజెపి ముందుగానే అభ్యర్థిని ప్రకటించింది. ప్రధాని మోడీ, బిజెపి గాలిని తట్టుకొని గెలవాలంటే కోమటిరెడ్డి కుటుంబంలోని వ్యక్తికి సీటు కేటాయిస్తేనే కాంగ్రెస్ గెలుపు సునాయాసంగా ఉండనున్నట్లు గా తెలుస్తుంది. అందులోనూ కోమటిరెడ్డి లక్ష్మి కి సీటికేటా ఇస్తే మరింత సులభంగా గెలిచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. గత రెండు పర్యాయాలుగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గెలుపు కోసం చేస్తున్న ప్రచారంలో కోమటిరెడ్డి లక్ష్మి మహిళల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ గాను పోటీ చేసి ప్రజలందరికీ పరిచయం అయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోను కోమటిరెడ్డి లక్ష్మి ప్రత్యేకంగా ఏంటి ఇంటికి తిరిగి ప్రచారం చేస్తూ మహిళలను ఆకట్టుకోగలిగారు. భువనగిరి పార్లమెంటు పరిధిలోని జనగామ నియోజకవర్గం లో ఇటీవల కోమటిరెడ్డి సుశీలమ్మ వృద్ధాశ్రమాన్ని ప్రారంభించి ఆ ప్రాంతంలోనూ కోమటిరెడ్డి లక్ష్మి పరిచయం అయిపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఉమ్మడి నల్లగొండ జిల్లా లో కోమటిరెడ్డి బ్రదర్స్ తమ సత్తాను చాటిన విషయం తెలిసిందే. భువనగిరి పార్లమెంటు పరిధిలో కోమటిరెడ్డి బ్రదర్స్ ను కాదని కాంగ్రెస్ నుంచి ఇతరులెవరు గెలిచే సత్తా లేదనేది కాంగ్రెస్ అధిష్టానానికి, నాయకులకు తెలిసిన విషయమే. ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భువనగిరి సీటుపై పలువురు కాంగ్రెస్ నేతలు కన్నేసి సీటు కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. కానీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి మునుగోడు అసెంబ్లీ సీటు ఇచ్చే సమయంలోనే ప్రభుత్వం రాగానే మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి చేసుకున్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఒక్కరికి మాత్రమే మంత్రి పదవి ఇచ్చిన అధిష్టానం రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వలేకపోయారు. ఇప్పటివరకు మంత్రి పదవి ఇవ్వనందున భువనగిరి పార్లమెంటు సీటును తన భార్య కోమటిరెడ్డి లక్ష్మికి ఇవ్వాలని అధిష్టానం వద్ద రాజగోపాల్ రెడ్డి పట్టుబట్టినట్లు తెలుస్తుంది. కోమటిరెడ్డి లక్ష్మికి భువనగిరి సీటును కేటాయిస్తే బిజెపి ,బిఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి కాంగ్రెస్ గెలుపు సునాయసమవుతుందని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు , అభిమానులు భావిస్తున్నారు.

# మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగిన
# వీర వనిత మల్లు స్వరాజ్యం

**విప్లవ నిప్పు కనక మల్లు స్వరాజ్యం**
**మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో మహిళలు ఉద్యమించాలి**
**కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి వేడుకలు**



నాంపల్లి, మార్చి 19(ప్రజాజ్యోతి): మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి మాట్లాడుతూ తెలంగాణలోని హైదరాబాద్ సంస్థానంలో ఫ్యూడల్ వ్యవస్థ, జాగీర్దార్, రజాకార్ల రాక్షసత్వం మీద, ఆ తర్వాత భారత సైన్యం మీద, తెలంగాణలోని అసంఖ్యాకమైన స్త్రీలు- పురుషులు చేసిన తిరుగుబాటు చారిత్రాత్మకం. నిజాం సంస్థానంలో కనీస పౌర హక్కులు, విద్యా, వైద్య అవకాశాలు శూన్యం. రైతుల మీద మోయలేని పన్నుల భారం, మధ్య యుగాల నాటి ఫ్యూడల్ అణిచివేత విధానం, లేవీ ధాన్యం వసూళ్లు, రాచరిక రాజ్యంలో నైజాం నవాబు పరిపాలనలో ఎన్నో దురాఘతాలు, ఎన్నోన్నో దుర్మార్గాలు. స్వేచ్ఛా వాయువులేని చీకటి రాజ్యమది. వెట్టిచాకిరీ, సాంఘిక ఆర్థిక దోపిడీ, ప్రజలకు ప్రాణరక్షణ లేని బానిస యుగాల నాటి దుర్మార్గమైనటువంటి పాలన కొనసాగుతున్నటు వంటి కాలమది. పువ్వు పుట్టగానే పరిమళించు అన్నట్లు ఆమె చిన్ననాడే పోరాట పంథాను ఎంచుకున్నారు. పదకొండేండ్ల వయస్సులో ఆమె తండ్రి చనిపోయాడు. అక్క శశికళ కూడా పోరాటంలో మూడేండ్లు జైలు జీవితం గడిపారు. స్వరాజ్యం తల్లి చుక్కమ్మ గొప్ప సామ్యవాది. తన కుటుంబమంతా నేటికి విప్లవ రాజకీయాలతో పెనవేసుకొని ఉన్నది. నాడు చెక్క పలకలపై ఇసుకలో ఓనమాలు దిద్దుకొని క్రమంగా ఐదోతరగతి వరకు విద్యనభ్యసించారు. చిన్నతనంలో కమ్యూనిస్టు భావాలు అలవర్చుకొని దోపిడీకి వ్యతిరేకంగా, తన సొంత గ్రామంలో గ్రామ పటేండ్లను, పెత్తందార్లను ఎదిరించి పాలేర్ల సంఘం పెట్టి కూలీ రేట్ల ఉద్యమంతో ప్రారంభమైన ఆమె విప్లవ జీవితం ఎనిమిది దశాబ్దాల పాటు ఎన్నడూ వెనుదిరగలేదు. విప్లవమే జీవితంగా భావించి ఎన్ని కష్టనష్టాలొచ్చినా ఆమె పోరాటాలకు తట్టుకోలేక పోలీసులు సొంతింటిని ధ్వంసం చేసినా, స్వరాజ్యంను పట్టుకుంటే నాటి ప్రభుత్వం బహుమతులు కూడా ప్రకటించినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగారు. తన అన్న భీంరెడ్డి నర్సింహ్మారెడ్డి (బి.ఎన్.) అడుగుజాడల్లో పోరాటాల్లోకి వచ్చిన ఆమె ఏనాడూ మడమ తిప్పలేదు. పోరాటమే ఆయుధంగా గెరిల్లా దళాల్లో చేరి దొరల దుర్మార్గాలను ఎదుర్కొంటూ నైజాం రజాకార్ల పోలీసులకు ముచ్చెమటలు పట్టించిన ధీరవనిత. విప్లవోద్యమంలో తనదైన ముద్రవేసుకొని అలుపెరగని పోరాట యోధురాలిగా ఆమె మాటే.. తుపాకి తూటాలా ప్రభుత్వాల్ని గడగడలాడించినా ఆమె ధీరత్వానికి సలామ్. తెలంగాణలో భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె ముఖ్య భూమిక పోషించారు. వెట్టిచాకిరి రద్దు చేయాలని, దున్నే వానికి భూమి కావాలని, నైజాం నవాబు గద్దె దిగాలనే నినాదాలతో సాగిన మహత్తర సాయుధ పోరాటం, ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన ఉద్యమం. ఆ సాయుధ పోరాట ఫలితంగా తెలంగాణలో మూడు వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయి. నాలుగు వేల మంది కమ్యూనిస్టులు, ప్రజలు వీరమరణం పొందారు. పదిలక్షల ఎకరాల భూములు పేదలకు పంపిణీ చేయబడింది. భూస్వాముల భూములు, గడీలు ప్రజల స్వాధీనమైనవి. వెట్టిచాకిరీ రద్దయింది. వడ్డీ వ్యాపారం అక్రమ భేదాఖలు నిలిపివేయబడ్డాయి. వ్యవసాయ కూలిరేట్లు పెంచబడ్డాయి. నైజాం రజాకార్ల బారి నుండి రైతాంగాన్ని రక్షించుకొనేందుకు పది వేల మంది గ్రామరక్షక దళాలు, రెండు వేల మంది గెరిల్లా సాయుధ దళాలు నిర్మించారు. దేశవ్యాప్తంగా భూ సంస్కరణ చట్టం, కౌలుదారి చట్టం, పౌరహక్కుల చట్టం వచ్చాయి. ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లభించాయి. శాకామ్రేడ్ సరాజ్యం ఆశయాలు నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కోమ్ము లక్ష్మయ్య, కే లక్ష్మయ్య, కే శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన బార్ అసోసియేషన్ నామినేషన్ల ప్రక్రియ

**ఆవుల మల్లికార్జున రావు**

కోదాడ టౌన్ మార్చి 19( ప్రజాజ్యోతి): కోదాడ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక కోసం ఈనెల 28న నిర్వహించే ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంగళవారం నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి గాలి శ్రీనివాస్ నాయుడు, చింతకుంట్ల రామిరెడ్డి , నాళం రాజయ్య, ఎస్ ఆర్ కె మూర్తి , ఎలకా సుధాకర్ రెడ్డి , సాధు శరత్ బాబు లు తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి గట్ల నర్సింహారావు , యడ్లపల్లి వెంకటేశ్వర్లు , బండి వీరభద్రం , తూములూరి సీతారామరాజు, ప్రధాన కార్యదర్శిగా ఉయ్యాల నర్సయ్య, గట్ల నర్సింహారావు, బండి వీరభద్రం , సాధు శరత్ బాబు, చింతకుంట్ల రామిరెడ్డి, తమ్మినేని హనుమంతరావు , సంయుక్త కార్యదర్శి గా కోడూరు వెంకటేశ్వర రావు , సరికొండ. హనుమంత రాజు , ఇరుకుల్ల చెన్నకేశవ రావు , షేక్ కరీముల్లా, కోశాధికారిగా కోడూరు వెంకటేశ్వర రావు, తూములూరి సీతారామరాజు, సరికొండ హనుమంత్ రాజు, గ్రంధాలయ కార్యదర్శిగా పొలూరి. హేమలత, మందా వెంకటేశ్వర్లు,షేక్ కరేముల్లా, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా వేల్పుల మోష , పోలూరి హేమలత, మహిళా ప్రతినిధిగా వి. ధనలక్ష్మి , 1వ కార్యవర్గ సభ్యులుగా దొడ్డ శ్రీధర్, మహ్మద్ హుస్సేన్ , 2వ కార్యవర్గ సభ్యులు గా సామా నవీన్ కుమార్ బి.దుర్గ, 3వ కార్యవర్గ సభ్యులుగా షేక్ నాగుల్ పాషాలు తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 21 వ తేదీన నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హత కలిగిన నామినేషన్లు వివరాలను ప్రకటించనున్నట్లు ప్రధాన ఎన్నిక అధికారి వెజెళ్ళ రంగారావు, ఉప ఎన్నికల అధికారి షేక్ జానీపాష, సహాయ ఎన్నికల అధికారి ఆవుల మల్లికార్జున రావులు తెలిపారు. 22న నామినేషన్లు ఉప సంహరణ అనంతరం పోటీలో వుండే వారు వివరాలు ప్రకటించి, 28వ తేదీన ఎన్నికలు జరిపి, సాయంత్రం కౌంటింగ్.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికలు కీలకం




కోదాడ టౌన్ మార్చి 19 (ప్రజా జ్యోతి): భారతదేశ అభివృద్ధి ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికలు కీలకమని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మెన్ డా. బొమ్మర బోయిన కేశవులు అన్నారు. మంగళవారం కోదాడ లోని త్రివేణి డిగ్రీ కాలేజ్ లో సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు అవగాహన సదస్సు లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలు కీలకమని చెప్పారు. దేశ భవిష్యత్తు ను నిర్దేశించే ఎన్నికలలో ఓటు హక్కు వున్న ప్రతి పౌరుడు ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ధనిక, పేద, అడ, మగా అన్న బేధం లేకుండా 18 సంవత్సరాలు నిండిన అందరికీ ఓటు హక్కు కల్పించారని చెప్పారు. ఓటును అమ్ము కాకుండా నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని సూచించారు. నా ఒక్క ఓటు తో ఏమవుతుంది అన్న అభిప్రాయం వున్న వాళ్ళ తమ మనసు నుంచి దానిని తొలగించుకోవాలని సూచించారు. బిందు బిందువు సిందువైనట్లు నువ్వు వేసే ప్రతి ఓటు దేశ భవిష్యత్తు ను నిర్దేశిస్తుందనీ చెప్పారు. ఈ సారి జరిగే ఎన్నికలలో యువత కీలకంగా వ్యవహ రించాలన్నారు. మీరు ఓటు వేయడంతో పాటు మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిసర ప్రాంత వాసులు పోటీ చేసే అభ్యర్థుల్లో నచ్చిన అభ్యర్థికి ఓటు వేసేలా ప్రోత్సహించాలని సూచించారు. ఒకవేళ అభ్యర్థులు ఎవరు నచ్చని పక్షంలో నోటా కు ఓటు వేయాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో ఓటును ఓటు హక్కును వినియోగించకుండా ఉండ వద్దని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో నాయకులు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు కుటిల యత్నాలు చేస్తారని ఆ ఉచ్చులో పడవద్దని చెప్పారు. డబ్బులు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేస్తూ ప్రలోభ పెట్టే వారిని సీ- విజిల్ యాప్ లో పిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సీ- విజిల్ యాప్ ప□

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఫైనాన్స్ చైర్మన్ ను సన్మానించిన నాయకులు



తుర్కపల్లి మండలం, మార్చి19(ప్రజాజ్యోతి ): రాష్ట్ర ఓబీసీ సెల్ అధ్యక్షుడు నూతి శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఫైనాన్స్ చైర్మన్ గా నియమించబడిన సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఓ బి సి జిల్లా కోఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు . ఈ కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గ ఓబీసీ సెల్ మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కలిసి శ్రీ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పవన్ రాజ్, తుర్కపల్లి మండల ఓబీసీ అధ్యక్షుడు మారగొని వెంకటేష్ గౌడ్ ,జిల్లా సహాయ కార్యదర్శి మారగోని ప్రవీణ్, మండల ఉపాధ్యక్షుడు గుండెబోయిన ఐలేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు గుర్రాల కనకరాజు, తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడి క్రేంద్రం-5లో పోషణ పక్వాడపై అవగాహన



నిడమానూరు, మార్చి 19(ప్రజాజ్యోతి): మండల కేంద్రంలోని నిడమనూరు అంగన్వాడి సెంటర్-5లో మంగళవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనుముల ప్రాజెక్ట్ సిడిపివో గంధం పద్మావతి ,సూపర్వైజర్ సైదా బేగంలు హాజరైయ్యారు. ఈ సందర్భంగా అనుముల ప్రాజెక్ట్ సిడిపివో గంధం పద్మావతి మాట్లాడుతూ గర్భిణీ ,బాలింతలకు, పోషక విలువలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలని తల్లులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా గర్భిణీ, బాలింతలకు, చిరుధాన్యాలు ,ఆకుకూరలు, ఎక్కువగా పోషకాలు ఉన్నటువంటి ఆహారం తీసుకోవాలన్నారు. పోషకాల విలువలు కలిగిన తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్నటువంటివి తీసుకోవాలి. అవి రాగులు, జొన్నలు,దైదలు, సజ్జలు, కందులు మినుములు,ఈ చిరుదాన్యాలలో ఎక్కువ పోషక విలువలు కలిగి ఉంటాయి. కనుక తప్పక తీసుకోవాలని అన్నారు. తల్లులకు ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. అలాగే 3-6 ఏళ్ల పిల్లలకు అంగన్ వాడే కేంద్రంలో గ్రుడ్లు, మధ్యాహ్నం భోజనంతో పాటు పిల్లల ఎదుగుదల ఎత్తు గురించి తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు, అంగన్వాడీ టీచర్లు ,పిల్లలు , ర్యాలీలో వారికి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్. రాజేశ్వరి ,సుగుణ వహీదా , పద్మజ, పద్మావతి ,ఝాన్సీ , తల్లులు, తదితరులు, పాల్గొన్నారు.



# గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి

**ఆర్డీవో కు రైతు సంఘం నాయకుల వినతి**

మిర్యాలగూడ, మార్చి 19, ( ప్రజా జ్యోతి ): ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు కోరారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డివో జి .శ్రీనివాసరావుకు వినతి పత్ర%శీ% సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభమైనప్పుడు మిల్లర్లు సన్న రకం ధాన్యానికి క్వింటాల్ కు 2700 చొప్పున ధర ఇచ్చారని, ఇప్పుడు మిల్లర్లు సిండికేట్ గా మారి ధర తగ్గించి రైతులను అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నాణ్యత గల ధాన్యానికి కూడా 2200, 2300 మాత్రమే ధర ఇస్తున్నారని, అదికూడా రైతులను



మిల్లుల వద్ద పడిగాపులు కాయించి చివరికి ధాన్యం తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సరైన ధర రాక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. బయట రాష్ట్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి స్థానికంగా పండిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా మిల్లర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. అధికారులు చొరవ చూపి మంచి ధరతో ధాన్యం కొనుగోలు చేసేలా రైస్ మిల్లర్లపైఒత్తిడితీసుకురావాలని కోరారు. రైతు సంఘాల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయించి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తీసుకొని వాటిని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాగిరెడ్డి మంగారెడ్డి, పాల్వాయి రామ్ రెడ్డి, రవి నాయక్, కె. వెంకటరెడ్డి, చౌగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక సంద్రంలో కోదాడ

**వేద పండితుల మంత్రోచ్ఛారణలతో మారుమోగుతున్న కోదాడ**

**బంధువులతో కిటకిటలాడుతున్న ఇండ్లు**

**పండుగ వాతావరణం లో కోదాడ ప్రజలు**

**పుట్టింటి వారికి మెట్టినింటి వారికి బట్టలు పెట్టాలని సాంప్రాదాయం లో కోదాడ వాసులు**

కోదాడ టౌన్ మార్చి 19( ప్రజా జ్యోతి): కోదాడ కోదండ రామస్వామి దేవాలయంలో ప్రతిష్ట మహోత్సవాల సందర్భంగా పట్టణంలో పండుగ వాతావరణం అలుము కుంది.బుధవారం ధ్వజ స్తంభామ్ ,మహా అన్నదానాలు ,ప్రత్యేక పూజలు ఉండడంతో ఇప్పటికే బంధువులతో ఇళ్లు కిటకిటలాడుతున్నాయి.పుట్టింటి వారికి మెట్టినింటి వారికి బట్టలు పెట్టాలని సాంప్రాదాయం లో కోదాడ వాసులు ఉన్నారు.కనుల పండువగ ప్రతిష్ట మహోత్సవాలు.......

నాలుగవ రోజు యాగశాల వద్ద ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వేద పండితులు తెల్లవారుజామునుండే విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఆంజనేయ స్వామికి విశేష అభిషేకం, మన్యసూక్త హవనం, నిత్య కార్యక్రమాలు కనుల పండువాగ జరిపారు. మున్సిపల్ చైర్మన్ సామినేని. ప్రమీల, రమేష్ దంపతులతో పాటు పట్టణ ప్రముఖులు యాగశాల వద్ద యజ్ఞ కార్యక్రమం లో పాల్గొన్నారుహా శ్రీరాముల వారు చెన్నకేశవ స్వామి అవతారంలో పంచాయుధాలు ధరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం నేడు ప్రతిష్ఠించబోయే దేవతల విగ్రహాలను దేవాలయం వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు......

## వెంకన్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



తిరుమలగిరి మార్చ్ 19 (ప్రజా జ్యోతి):తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకన్న తాడిచెట్టుఎక్కుతుండగాప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మృతి చెందగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశానుసారం లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాలకుర్తి రాజయ్య మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దారావత్ జిమ్మి లాల్ మృతుని కుటుంబానికి అందజేశారు. మృతునికి భార్య ఒక కుమార్తె ఉన్నారు ఇతనికి ఆర్థికంగా ఎటువంటి భూమి కూడా లేదు కులవృత్తి మీద బ్రతుకుతెరువు జీవనం సాగిస్తున్నాడు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పేరాల వీరేష్, గుండెపురి గ్రామ బొడ్డు బాలకృష్ణ, తిరుమలగిరి మండల యూత్ అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులు బలిక రమేష్, తిరుమలగిరి మండల సేవా దల్ అధ్యక్షులు కోనేటి మహేష్, కోమ్ము సోమన్న, పరశరం, పి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు




చింతలపాలెం మార్చి 19 (ప్రజా జ్యోతి) :- సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా కృష్ణపట్టి పరివాహక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంటుందని ఎస్సై సైదిరెడ్డి అన్నారు. చింతలపాలెం మండలంలో దొండపాడు క్రాస్ రోడ్ లో ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. చింతలపాలెం మండలం తెలంగాణ ఆంధ్ర రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో మొత్తం మండలంలో నాలుగు చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు, బుగ్గ మాధవరం క్రాస్ రోడ్, పులిచింతల ప్రాజెక్టు, దొండపాడు, చింత్రియాల వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామని, సిబ్బంది 24 గంటలు విధుల్లో ఉంటారని అన్నారు. ఆధారాలు లేకుండా 50 వేల నుంచి నగదు తరలిస్తే స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

## వాడపల్లి సరిహద్దు చెక్ పోస్టు వద్ద 9.50 లక్షల నగదు పట్టివేత



దామరచర్ల, మార్చి 19, ( ప్రజా జ్యోతి ): ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా వాడపల్లి సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద కారులో తరలిస్తున్న 9.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వాడపల్లి ఎస్సై ఇరుగు రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నెల్లూరు పట్టణానికి చెందిన పెనక గోపీనాథ్ రెడ్డి హైదరాబాదు నుండి నెల్లూరుకు వెళ్తూ కారులో 9.5 లక్షల నగదు తీసుకు వెళుతున్నాడని, నగదుకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకొని మిర్యాలగూడ రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు తెలిపారు.



## ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్‌లపై డీఈఓకు ఫిర్యాదు చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు



దామరచర్ల,మార్చి 19, ( ప్రజా జ్యోతి ): దామరచర్ల మండలంలో ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్ల విధానంపై సోమవారం ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ లు మాట్లాడుతూ మండలంలోని తిమ్మాపురం, పుట్టల గడ్డ తండా పాఠశాలల్లో విద్యార్థులు లేకపోయినప్పటికీ ఉపాధ్యాయులు నియామకం చేయటం వలన వంతుల వారీగా డ్యూటీలు చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల తమ సంఘం తరఫున పాఠశాల పరిశీలించగా సమయం ముగియకముందే పాఠశాలకు తాళాలు వేసి ఉపాధ్యాయులు వెళ్లిపోయారనితెలిపారు.ఈ విషయంపై గతంలోనే ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇందిరానగర్ పాఠశాలలో కూడా డిప్యూటేషన్ పై పనిచేస్తున్న ఉపాధ్యాయుడు అందరితో దురుసుగా ప్రవర్తిస్తూ మీ ఇష్టం వచ్చిన అధికారికి చెప్పుకోమంటూ సమాధానం ఇస్తున్నారని తెలిపారు. వీటన్నిటి పై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు.

## నేడు మండలంలోని పలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం

**నిడమనూరు,ముప్పారం, గుంటిపల్లి,తుమ్మడం స్టేషన్ పరిధిలోని గ్రామాలకు అంతరాయం**

నిడమానూరు, మార్చి19(ప్రజాజ్యోతి): నిడమనూరు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ తో పాటు,ముప్పారం, గుంటిపల్లి,తుమ్మడం, ఆయా సబ్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి సబ్ స్టేషన్లకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేశం పేర్కొన్నారు. ఈసందర్భంగా ఏఈ వెంకటేశం మాట్లాడుతూ నిడమనూరు సబ్ స్టేషన్ పరిధిలోని నిడమనూరు టౌన్ ,నర్సింహులగూడెం, వెంకట్ నగర్ ,బంకాపురం ,రాజన్నగూడెం,వెనిగండ్ల ,పార్వతీపురం ,శాఖాపురం, మర్లగడ్డ తండా, క్యాంప్, గ్రామాలతో పాటు ముప్పారం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి ముప్పారం ,ఊట్కూర్, గుంటిక గూడెం ,నందికొండవారిగూడెం ,సోమవారిగూడెం ,వేంపాడు, గగినపల్లి వారి గూడెం ,వెంగన్నగూడెం, బాలాపురం , గ్రామాలతో పాటు గుంటిపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని జూలకంటి వారిగూడెం ఫీడర్ లో గ్రామాలైన జూలకంటి వారిగూడెం తదితర గ్రామాలతో పాటు అదేవిధంగా తుమ్మడం సబ్ స్టేషన్ పరిధిలోని నారమ్మ గూడెం ఫీడర్ గ్రామాలైన నారమ్మగూడెం ,వడ్డెరగూడెం ,వల్లభాపురం కక్కయ్య గూడెం ఆయా ఫీడ్డర్ పరిధిలోని గ్రామాలకు బుధవారం 20/03/2024 మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంటు లైన్ ల కింద ఉన్న చెట్లను తొలగించుట కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నిడమానూరు ఏఈ వెంకటేశం తెలిపారు.కరెంటు గృహ వినియోగదారులు , వాణిజ్య వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి అధికారులకు సహకరించి మీకు కలిగిన అంతరాయానికి అందరూ సహకరించగలరని కోరుతున్నాం.

## అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం పట్టివేత



తిరుమలగిరి మార్చి 19 (ప్రజా జ్యోతి): తిరుమలగిరి మండలం పరిధిలోని కన్నా రెడ్డి కుంట తండ మరియు చుట్టుపక్కల ఉన్న హాలో తండాలలో ప్రభుత్వం పేద ప్రజలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు కోళ్ల ఫారంలకు అమ్మడానికి ఆటోలో తరలిస్తున్న వ్యక్తుల నుండి పీడీఎస్ బియ్యం 13 బస్తాలు అందాజ ఐదు కింటాల బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేశామని ఎస్ ఐ కే సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

# సోషల్ మీడియాపై పిల్లలకు అవగాహన సదస్సు

**ఆడపిల్లలను వేధించిన, అసభ్యకరంగా ప్రవర్తించిన కఠిన చర్యలు తప్పవు**

**ఆపద సమయంలో టోల్ ఫ్రీ నెంబర్ 100 సంప్రదించాలి**





నాంపల్లి,మార్చి,19(ప్రజా జ్యోతి):ఆడపిల్లలను వేధించిన, అసభ్యకరంగా ప్రవర్తించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో మార్ఫిడి చేసిన తీవ్రమైన నేరంగా పరిగణించి కఠినంగా శిక్షలు విధించబడతాయని నాంపల్లి పోలీసులు అన్నారు. మంగళవారం నాంపల్లి మండల కేంద్రంలోని స్థానిక గాంధీజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో షీ-టీమ్ ఈ-వ్ టీచింగ్, సోషల్ మీడియాపై పిల్లలకు పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ.... ఈ మధ్యకాలంలో సోషల్ మీడియా వేదికగా ఎన్నో క్రైమ్స్ జరుగుతున్నాయనీ, కొందరు సైకో నేరగాళ్లు మహిళలపై మోసాలకు, వేధింపులకు పాల్పడుతున్నారనీ అన్నారు. అందుకే ఇలాంటి వారి నుంచి మహిళలను, చిన్న పిల్లలను కాపాడడానికి తెలంగాణ రాష్ట్రం ఉమెన్స్ షీ టీమ్స్ రంగంలోకి దిగినట్లు తెలిపారు. షీ- టీమ్ సోషల్ మీడియా మహిళలపై వేధింపులకు అడ్డుకట్ట వేసేందుకే ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని పిల్లలకు వివరించారు. పిల్లలకు ఎలాంటి ఆపద సమయంలోనైనా 100 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలని తెలిపారు.ఆపద సమయంలో ఎక్కడున్నా మీ లొకేషన్ బట్టి మిమ్మల్ని సేవ్ చేస్తామని అన్నారు. పోలీసులంటే భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా ఆడపిల్లల పట్ల పోకిరి చేష్టలు ఎవరైనా చేస్తే ఉపేక్షించకుండా తక్షణమే కేసులు నమోదు చేసి, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి కటకటాలకు పంపే ప్రణాళికలు తయారు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు, పాఠశాల డైరెక్టర్లు సరికొండ వెంకన్న, కర్నాటి నాగరాజు, ప్రిన్సిపల్ బంధనాథం సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**హుజూర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు**

గరిడేపల్లి మార్చి 19(ప్రజా జ్యోతి): ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హుజూర్నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు తెలిపారు. మంగళవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో గల పోలీస్ స్టేషన్ లో రికార్డులను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ హుజూర్నగర్ సర్కిల్ పరిధిలో ఒకటి జిల్లా సరిహద్దు ఉన్నదని తెలిపారు. మఠంపల్లి మండలం మట్టపల్లి వద్ద రాష్ట్ర సరిహద్దు ఉన్నదని,నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి వద్ద జిల్లా సరిహద్దు ఉన్నదని అన్నారు. 11 మంది సభ్యులు గల పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఎక్సైజ్, ఐటి తదితర శాఖలకు సంబంధించిన అధికారులతో చెక్ పోస్ట్ ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హుజూర్నగర్ సర్కిల్ పరిధిలో ఉన్న నేరేడుచర్ల,గరిడేపల్లి, హుజూర్నగర్, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం పోలీస్ స్టేషన్ లలో సరిపడా సిబ్బంది లేనప్పటికీ, పనిచేసే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఐ ఈట సైదులు, రైటర్ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## లోక్ సభ ఎన్నికలు 2024 ఎన్నికల నిమిత్తం

(కోదాడ రూరల్ మార్చి 19 (ప్రజా జ్యోతి ): కోదాడ అంతరాష్ట్ర చెక్ పోస్ట్ అయిన రామాపురం రోడ్ వద్ద కోదాడ రూరల్ అనిల్ రెడ్డి మరియు సిబ్బంది కలిసి విజయవాడ నుండి హైదరాబాద్ వైపు వెళ్ళు వాహనాల తనిఖీలలో భాగంగా మొత్తం రూ.4,76,900/- రూపాయలు స్వాధీనం పరుచుకొని ప్రత్యేక విభాగం %ూ% టీం అధికారి %ూ%.వినయ్ కుమార్‌రికీ కోదాడ రూరల్ ఎస్సై అనిల్ రెడ్డి అప్పగించడం జరిగింది.





## మండల వ్యాప్తంగా నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

**మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల జైపాల్ రెడ్డి**

మునగాల మార్చి 19 (ప్రజా జ్యోతి):- మునగాల మండల వ్యాప్తంగా రానున్న వేసవికాలంలో ఏ గ్రామంలోనూ నీటి సమస్య రాకుండా ఉండాలని బీసీటీపారుదల %ఉ% పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు మరియు కోదాడ నియోజకవర్గ %మీూ% గౌ.శ్రీ ఉత్తమ్ పద్మావతి రెడ్డి లు మండలంలోని ప్రతి గ్రామానికి 2 లక్షల రూపాయల చొప్పున నిధులు కేటాయించగా నేలమర్రి ఎస్సీ కాలనీ లో బోరు పైప్ లైన్ కి మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల జైపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైప్ లైన్ బోరు వేయించి మిట్ట గూడెం నేలమర్రి గ్రామాల ప్రజలు 10 సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించటం జరిగింది అని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నలబోలు సతీష్ రెడ్డి, మాజీ సర్పంచ్ బిక్షం రెడ్డి, ఇంద్రారెడ్డి వీరారెడ్డి, సుందరయ్య, హరీష్ ,వెంకన్న, మణికంఠ, రాములు, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆహారపు అలవాట్లపై అవగాహన సదస్సు



కోదాడ రూరల్ మార్చి 19 (ప్రజాజ్యోతి): స్థానిక మాస్టర్ మైండ్స్ పాఠశాలలో 'ఫుడ్ ఫెస్టివల్ ' కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పొట్ట కిరణ్ కుమార్ మాట్లాడుతూ మారుతున్న జీవన విధానం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ప్రతి విద్యార్థికి ఆహారపు అలవాట్లపై అవగాహన ఉండాలి అని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. వాటిలో ఉండే పోషక విలువల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు శ్రీమన్నారాయణ కాలన్ని వాసులు పాల్గొని వంటకాలను తిలకించారు.

## లేఅవుట్ అనుమతులు లేని ప్లాట్లను కొనుగోలు చేయవద్దు

**మునగాల మండల తాసిల్దార్ వి.ఆంజనేయులు.**

మునగాల మార్చ్ 19 (ప్రజా జ్యోతి): గత కొద్ది రోజుల నుండి మునగాల గ్రామ ప్రజల నుండి వార్త కథనాల ద్వారా వస్తున్న లేఅవుట్ అనుమతులు లేకుండా ప్లాట్లు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వస్తున్న కథనాలపై మునగాల మండల తాసిల్దార్ వి ఆంజనేయులు స్పందించి మునగాల గ్రామపంచాయతీ పరిధిలో లేఅవుట్ అనుమతులు లేకుండా ఎవరు ప్లాట్ లో అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేఅవుట్ ఏర్పాటు చేసి అనుమతులు తీసుకొని మాత్రమే ప్లాట్లు అమ్మాలని, కొనేవారు కూడా అలాంటి లేఔట్ అనుమతులు ఉన్న ప్లాట్లను మాత్రమే కొనాలని ఆయన అన్నారు. లేఅవుట్ అనుమతి లేకుండా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలని రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వచ్చిన వారి యొక్క ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవద్దని కోదాడ సబ్ రిజిస్టర్ వారిని కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

హాలియా,మార్చి19(ప్రజా జ్యోతి) :

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన ఆరోగ్య సమస్యలు దరి చేరవని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాజు అన్నారు. హాలియా డిగ్రీ కళాశాల విద్యార్థులు గత వారం రోజుల నుంచి హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీం



పేట మొదటి వార్డ్ లో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని నిర్వహిస్తున్న సంగతి విజితమే.దీనిలో భాగంగా మంగళవారం మసీద్ ప్రాంగణం,పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు.ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాజు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన ఆరోగ్య సమస్యలు దరిచేరవని అన్నారు.ప్రతి ఒక్క విద్యార్థి సామాజిక సేవపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అంజాద్ ఖాన్, లెక్చరర్ డాక్టర్ మాధవి, ఆఫీస్ సభార్డినేటర్ ఇఫ్తికార్ ఉల్ హక్, ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయ ట్రస్టు సభ్యులను సన్మానించిన ఆడెపు రాజు,బాలమణీ దంపతులు



రాజాపేట, మార్చి 19 (ప్రజా జ్యోతి) రాజాపేట మండలం రేణికుంట గ్రామ రెవెన్యూ పరిధిలో సంకల్ప సిద్ధి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ మూర్తి ప్రతిష్ఠ ఉత్సవాల ముగింపు సందర్భంగా ట్రస్టు సభ్యులను రాజపేటకు చెందిన ప్రముఖ వ్యాపారి ఆడెపు రాజు బాలమణి పుణ్య దంపతులు చేనేతశాలతో సత్కరించి అభినందించారు. ఈకార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు కూర కళ్యాణి బద్రీనాథ్, కుంభాల శోభారాణి ఎల్లారెడ్డి, సూది రెడ్డి కళావతి నాగిరెడ్డి, గొట్టం మంజుల రాఘవేంద్ర, సమ్మెట వెంకట రాజేశ్వర్ శ్రీనివాసరావు ఇతర భక్తులు పాల్గొన్నారు.

## గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా భూక్య గణేష్

రాజాపేట మార్చి 19 (ప్రజా జ్యోతి)రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన భూక్య గణేష్ బీజేపి పార్టీ అనుబంధమైన గిరిజన జిల్లా మోర్చా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. మంగళవారం జిల్లా అధ్యక్షులు అజ్మీర్ రా కిషన్ నియామక పత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పారు. గిరిజనుల సంక్షేమం పార్టీ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని గణేష్ చెప్పారు.



# మత్స్యశాఖ చైర్మన్ కు సన్మానం చేసిన తిరుపతి బృందం



రాజాపేట మార్చి 19 (ప్రజా జ్యోతి) : రాజాపేట మండల ఫిషర్ మెన్ అధ్యక్షులు రాపాక తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర మత్య శాఖ చైర్మన్ గా నియమితులైన మెట్టు సాయికుమార్ ను కలిసి అభినందించి సత్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో సాయికుమార్ కు ఈ అవకాశం దక్కిందని ముఖ్యమంత్రితోపాటు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వారు కృతజ్ఞతలు చెప్పారు. జిల్లా అధ్యక్షులు శ్యామల ధర్మరాజు, ఉపాధ్యక్షులు జానకిరామ్, రాజపేట మండల శాఖ అధ్యక్షులు రాపాక తిరుపతి, పిట్టల జయరాములు, అంకిరెడ్డి బాలయ్య, ఉచ్చంతల శీను తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

# కనుల పండువగ ప్రతిష్ట మహెూత్సవాలు

కోదాడ రూరల్ మార్చి 19 ( ప్రజా జ్యోతి ): కోదాడ పట్టణంలో పునర్నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి



దేవాలయంలో ప్రతిష్ట మహెూత్సవాలు వైభవంగా లినాలుగవ రోజు యాగశాల వద్ద ఉత్సవాల్లో భాగంగా వేద పండితులు తెల్లవారుజామునుండే విశేష పూజలు, హెూమాలు నిర్వహిస్తున్నారు.ఆంజనేయ స్వామికి విశేష అభిషేకం, మన్యసూక్త హవనం, నిత్య కార్యక్రమాలు కనుల పండుగ వాతవరణం...

# పులిచర్లలో 16.22 లీటర్ల మద్యం పట్టివేత

**పెద్దవూర ఎస్ఐ పి,వీరబాబు**

పెద్దవూర మార్చ్19( ప్రజాజ్యోతి) మండల కేంద్రంలోని పులిచర్ల గ్రామంలో మాడుగుల శీను బెల్ట్ షాప్ పై నమ్మదగిన సమాచారం మేరకు రైడ్ చేయగా ఆ షాపులో 23 బీర్లు, 5క్వార్టర్లు ఆఫ్ బాటిల్ మందు మొత్తం16.22 లీటర్ల మద్యం అక్రమంగా షాపులో పెట్టుకొని ఏలాంటి పర్మిషన్ లేకుండా అమ్ముతుండగా పెద్దవూర ఎస్ఐ పి, వీరబాబు మద్యం పట్టుకొని మాదుల శీను పై కేసు నమోదు చేశారు ఎన్నికల కోడ్ విరుద్ధంగా మద్యం డబ్బు ఇతర విలువైన వస్తువులు రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.



# వృత్తి విద్యా కోర్సులకు ఆహ్వానం

**స్పాట్ అడ్మిషన్లకు నేడే చివరి తేది.**



మునగాల మార్చి 19 (ప్రజా జ్యోతి): 2023 - 24 విద్యా సంవత్సరానికి తెలంగాణ స్టేట్ ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ద్వారా వృత్తి విద్య సర్టిఫికెట్ కోర్సులకు అడ్మిషన్ల ప్రారంభమైనట్లు కోదాడ లక్ష్య ఎడ్యుకేషన్ అకాడెమీ కోఆర్డినేటర్ అనంతుల సతీష్ మంగళ వారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. తమ అకాడమీలో కొర్సులు ల్యాండ్ సర్వేయర్(6నెలలు) ,బ్యూటిషన్ (3నెలలు), ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ (9నెలలు) ,కోర్స్ కోర్సులకువిద్య సంవత్సరానికి అడ్మిషన్లు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.ఈ అవకాశాన్ని నిరుద్యోగులు విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదో తరగతి పాసైన వారు, ఆ పై చదివిన వారందరికీ అవకాశం ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ల్యాండ్ సర్వేర్ కోర్సులకు బ్యూటిషన్ మరియు ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ కోర్సులకు మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. స్వల్పకాలిక వృత్తి విద్య కోర్సులకు ప్రవేశాలు విడుదల ప్రభుత్వ గుర్తింపు పొందిన ఇంటర్మీడియట్ బోర్డు ద్వారా సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలిపారు. స్వల్పకాలిక కోర్సులు పూర్తిచేసి ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలు ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. అడ్మిషన్ కావాలనుకున్న వారు అడ్మిషన్ల కి చివరి తేదీ ఈ నెల 20 వరకు స్పాట్ అడ్మిషన్లు వున్నవి మరిన్ని వివరాలకు లక్ష్యా డిస్టెన్స్ అకాడమీ నయానగర్ ,కోదాడ ,బ్రిలియంట్ స్కూల్ పక్కన ఫోన్ నంబర్లకు 9542107771 , 7981528312 సంప్రదించాలని కోరారు.

# బిజెపి మాజీ అధ్యక్షుడు బాల్ రెడ్డికి మాతృవియోగం

రాజాపేట, మార్చి 19 (ప్రజా జ్యోతి) రాజపేట మండల బీజేపీ మాజీ అధ్యక్షులు కాయితి బాల్ రెడ్డి కి మాతృవియోగం చెందగా మంగళవారం ఆయన స్వగ్రామమైన జాల గ్రామంలో పరామర్శించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి అశోక్ గౌడ్, ఆలేరు అసెంబ్లీ కన్వీనర్ చిరిగే శ్రీను, మండల అధ్యక్షుడు దాచేపల్లి రాజు, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్రీను



నాయక్, సీనియర్ నాయకులు కానుగంటి శ్రీనివాస్ రెడ్డి, మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధురి, మండల మహిళ మోర్చా అధ్యక్షురాలు బూరుగు రాణి, నెమిలా మాజీ సర్పంచ్ మమతా రమేష్, మెందు భగవాన్ రెడ్డి, బూరుగు శేఖర్ రెడ్డి , తుమ్మల మురళీధర్ రెడ్డి, కానుగంటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పన్నాల చంద్రశేఖర్ రెడ్డి, భూక్య శ్రీను, జాల అధ్యక్షులు కర్రే ప్రవీణ్, పాల సంఘం చైర్మన్ గాండ్ల నర్సింగరావు, తునికి దశరథ, కమిటీ గారు కృష్ణ, పులి పంపుల మహేష్, రమేష్, భోగ శ్రీను, బోనగిరి శ్యాంసుందర్, రాజశేఖర్ రెడ్డి, బూర్గు శేఖర్ రెడ్డి, దయ్యాల కుమార్ స్వామి, మధు, నరేష్, వివిధ గ్రామాల నాయకులు వివిధ పార్టీల నాయకులు పరామర్శించి ఓదార్చారు.

# రేణికుంటలో పోషణ పక్వాడ కార్యక్రమం



రాజాపేట మార్చి 19 (ప్రజా జ్యోతి) : పోషణ్ పక్వాడలో భాగంగా మంగళవారం రాజాపేట మండలంలోని రేణికుంట గ్రామంలో అంగన్వాడీ కేంద్రం - 2 లో ఐసిడిఎస్ సూపర్వైజర్ రమణ అధ్యక్షతన తల్లుల సమావేశం జరిగింది . వారికి పోషకాహారం , చిరుధాన్యాల డిస్ప్లే ద్వారా వారికి న్యూట్రిషన్ పై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ సెక్రెటరీ బిర్రు పవన్ ఐసిడిఎస్ సేవలను ప్రతి ఒక్క లబ్ధిదారులు వినియోగించుకోవాలని ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని, ప్రతి ఒక్కరూ పూర్తి ఆరోగ్యంగా ఉంటేనే గ్రామం కూడా అభివృద్ధి పథంలో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ,దేవిక, జ్యోతి ఆశా కార్యకర్తలు కరుణ, విజయ తల్లులు, బొద్దుల మౌనిక, కిశోర బాలికలు పాల్గొన్నారు. అనంతరం ఎంపీటీసీ , పంచాయతీ సెక్రెటరీ , సూపర్వైజర్ రమణ తల్లులకు పిల్లలకు వండిన భోజనాన్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చ

# ముగిసిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

హుజూర్ నగర్, మార్చి19 (ప్రజా జ్యోతి): ఈనెల 26వ తేదీన బార్ అసోసియేషన్ కు జరగబోతున్న ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మంగళవారం ముగిసినట్లు ప్రధాన ఎన్నికల అధికారి ఎం.ఎస్. రాఘవరావు, సహాయ ఎన్నికల అధికారి వొట్టికూటి అంజయ్య లు మంగళవారం విలేకరులకు ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, క్రీడల, సాంస్కృతిక కార్యదర్శి, గ్రంథాలయ కార్యదర్శి పదవులకు ఒక్కొక్కరు చొప్పున కార్యవర్గ సభ్యులుగా నలుగురు మొత్తం 11 పోస్టులకు ఎన్నికలు నిర్వహించవలసి ఉండగా అధ్యక్ష పదవికి 02 నామినేషన్లు, ఉపాధ్యక్ష పదవికి 04 నామినేషన్లు, ప్రధాన కార్యదర్శి పదవికి 05 నామినేషన్లు, జాయింట్ సెక్రటరీ పదవికి 04 నామినేషన్లు, కోశాధికారి పదవికి 01 నామినేషన్, క్రీడల సాంస్కృతిక కార్యదర్శి పదవికి 03 నామినేషన్లు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి 02 నామినేషన్లు, కార్యవర్గ సభ్యుల పదవులకి 07 నామినేషన్లు చొప్పున మొత్తం 28 నామినేషన్ లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. బుధవారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమం ఉంటుందని అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని ఎన్నికల అధికారులు యం.ఎస్ రాఘవరావు, వట్టికూటి అంజయ్య లు ఆ ప్రకటనలో తెలిపారు.

# వాహన తనిఖీల్లో 84 వేలనగదు పట్టివేత

మిర్యాలగూడ, మార్చి 19, ( ప్రజా జ్యోతి ): మిర్యాలగూడ పట్టణంలోని టూ టౌన్ పరిధిలో చేపట్టిన వాహన తనిఖీల్లో 84,290 రూపాయలునగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పి. నాగార్జున తెలిపారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా వాహన తనిఖీలు చేపడుతుండగా గంగుల రాంబాబు అనే వ్యక్తి తన వాహనంలో నగదు తీసుకు వెళు తుండగా పట్టుకున్నామని, సరైన పత్రాలు చూపించకపోవడంతో




నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ ఐ కృష్ణయ్య,సిబ్బంది ఉన్నారు.

# శుభ్రం చేస్తున్న సుమారు 16టన్నుల పిడిఎస్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ,మార్చి 19,( ప్రజా జ్యోతి ): నిర్మానుష్య ప్రదేశంలో శుభ్రపరుస్తున్న సుమారు 16 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం శివారు ఇండస్ట్రియల్ ఏరియాలో పిడిఎస్ బియ్యాన్ని లారీల్లో తీసుకొచ్చి ఖాళీ ప్రదేశంలో వడబోసి శుభ్రం చేస్తుండగా, విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ విషయాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరిశీలించి పిడిఎస్ బియ్యంగా నిర్ధారించుకునేందుకు శాంపిల్స్ తీసుకొని ల్యాబ్కు పంపించారు.బియ్యం శుభ్రం చేస్తున్న కూలీలను వివరాలను అడిగి తెలుసుకోగా కూలీ ఇస్తామని చెప్పడంతో తాము శుభ్రం చేస్తున్నామని ఓనర్లు ఎవరో తమకు తెలియదని చెప్పారని సమాచారం.ఈ మేరకు పోలీసులు లారీలు సీజ్ చేసి బియ్యం స్వాధీనపరుచుకుని లేబరేటరీ నుండి రిపోర్ట్ వచ్చిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామని రూరల్ ఎస్సై నరేష్ తెలిపారు.కాగా ఈ బియ్యాన్ని వరంగల్ పట్టణంలో పలు కేసుల్లో స్వాధీన పరుచుకున్న బియ్యాన్ని టెండర్ వేసి ప్రభుత్వ నుండి అనుమతితో తీసుకువచ్చినట్లుగా, వాటిని శుభ్రపరుస్తున్నట్లుగా విశ్వసనీయ సమాచారం.

## పోటీ పరీక్షల ప్రత్యేకం...

# భారతదేశ భౌగోళిక స్వరూపాలు, కనుమలు

నాంపల్లి,మార్చి,19(ప్రజా జ్యోతి):పడమటి కనుమలు:పడమటి కనుమలు1600 కిలోమీటర్ల పొడవున ఉన్నాయి.గూడలూరు వద్ద నీలగిరి పర్వతాలు పడమటి కణాలు కలుస్తాయి. ఇవి 2000 మీటర్ల ఎత్తు వరకు ఉన్నాయి. ప్రఖ్యాతిగాంచిన వేసవి విడిది అయిన ఉదక మండలం నీలగిరి పర్వతాల్లో ఉంది.దీనినే ఊటీ అంటారు. ఈ నీలగిరి పర్వతాల్లో ఎత్తైన శిఖరం దొడపెట్ట (2637) మీటర్లు, అనేముడి 2600 మీటర్లు ఎత్తైన శిఖరం. దక్షిణ భారతదేశంలో అన్నామలై కొండలలోనీ అనైముడి (2698) మీటర్లు ఎత్తైన శిఖరం.

తూర్పు కనుమలు: ఉత్తరాన మహానది లోయ నుంచి దక్షిణాన నీలగిరి పర్వతాల వరకు తూర్పు కనుమలు విస్తరించి ఉన్నాయి. తూర్పు కనుమలు విచ్ఛిన్న శ్రేణులు. పశ్చిమ కనుమల్లో పుట్టిన గోదావరి, కృష్ణ వంటి నదులు పీఠభూమి గుండె ప్రవహిస్తూ బంగాళాఖాతంలో కలుస్తాయి. తూర్పు కనుమలలో ఎత్తైన పర్వతం అరోమ కొండ, దీని ఎత్తు (1680) మీటర్లు.. నల్లమల, వెలికొండ, పాలకొండ, శేషాచలం వంటివి తూర్పు కనుమల్లోని భాగాలుగా ఉన్నాయి.

**థార్ ఎడారి:**

ఆరావ పర్వతాల వర్షచ్ఛాయ ప్రాంతంలో థార్ ఎడారి ఉంది. ఇక్కడ వర్షపాతం తక్కువ, సంవత్సర వర్షపాతం 100 నుంచి 150 మిల్లీమీటర్ల మధ్య ఉంటుంది. రాజస్థాన్ లోని అధిక భాగం ఈ ఎడారి విస్తరించి ఉంది. ఇక్కడ శుష్క వాతావరణం ఉంటుంది.



వర్షాకాలంలో వాగులు ఏర్పడి ఆ కాలం అయిపోవడంతోనే కనుమరుగవుతాయి. ఈ ప్రాంతంలో ఉన్న ఒకే ఒక్క నది "లూని". ఎడారులలో ప్రవహించే నది కాలువలోని నీరు సముద్రాన్ని చేరకుండా సరస్సులలోనికే అంతస్థలీయ ప్రవాహం ప్రవహిస్తాయి.

దేశంలో అత్యంత పొడవైన ఇందిరాగాంధీ కాలువ (650 కిలోమీటర్లు) థార్ ఎడారికి నీళ్లు అందిస్తుంది. దీని కారణంగా ఎడారి ప్రాంతంలో ఎన్నో హెక్టార్ల భూమి సాగులోకి వచ్చింది.

**తీర మైదానాలు**

ద్వీపకల్ప పీఠభూమి దక్షిణ భాగంలో పశ్చిమాన అరేబియా మహాసముద్రం వెంట తూర్పున బంగాళాఖాతం వెంట సన్నటి తీర ప్రాంతం మైదానాలు ఉన్నాయి. పడమటి తీర మైదానం రాణ్ ఆఫ్ కచ్ వద్ద మొదలయ్యి కన్యాకుమారి వరకు ఉంటుంది.

తీర మైదాన ప్రాంతాలను మూడు ప్రధాన భాగాలుగా విభజించవచ్చు:

1.కొంకన్ తీర ప్రాంతం: ఇది ఉత్తర భాగం మహారాష్ట్ర గోవాలో విస్తరించి ఉంది.

2. కెనెరా తీర ప్రాంతం: ఇది మధ్య భాగం కర్ణాటకలోని తీరం దీని కిందకు వస్తుంది.

3. మల భార్ తీర ప్రాంతం: ఇది దక్షిణ భాగం, ప్రధానంగా కేరళ రాష్ట్రంలో ఉంది.

4. ఈ తీర ప్రాంతం మీదనాలను స్థానికంగా వివిధ పేర్లతో పిలుస్తారు. ఉత్కల్ తీరం (ఒడిస్సా), సర్కార్ తీరం (ఆంధ్ర ప్రదేశ్), కోరమండల్ తీరం (తమిళనాడు),

ఒడిస్సా లోని చిల్కా సరస్సు, ఆంధ్ర ప్రదేశ్ లోని కొల్లేరు, పులికాట్ చెరువులు తీర ప్రాంత మైదానంలో ముఖ్యమైన భౌగోళిక అంశాలుగా చెప్పవచ్చు.

దీవులు: భారతదేశంలో రెండు ద్వీప సమూహాలు ఉన్నాయి .బంగాళాఖాతంలోని అండమాన్, నికోబార్ దీవులు, అరేబియా సముద్రంలోని లక్ష దీవులు. భారతదేశ దక్షిణాది అంచు నికోబార్ దీవిలోని ఇందిరా పాయింట్ దగ్గర ఉంది. 2004లో సంభవించిన సునామీలో ఇది ముంపుకు గురి అయింది. లక్షద్వీప దీవులు ప్రవాల భిత్తి కల (కోరల్) నుండి ఏర్పడ్డాయి. వీటి మొత్తం భౌగోళిక వి స్తీర్ణం 32 చదరపు కిలోమీటర్లు.. కొన్ని ప్రాంతాలు హిమాలయాల నుంచి ప్రవహించే ఉత్తుంగ నదులతో సాగు చేయబడుగా, మరికొన్ని పశ్చిమ కనుమలు అక్కడి అడవుల్లో పుట్టిన వర్షాధార నదులతో సాగు చేయబడుతున్నాయి.



## ముప్పారం శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవానికి పలువురికి ఆహ్వానం



నిడమనూరు,మార్చి 19(ప్రజాజ్యోతి):ముప్పారం శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం లో భాగంగా మార్చి24,25 తేదిల్లో నిర్వహించనున్నారు.అదేవిధంగా మార్చి 24న గరుడముద్ద,25న వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాలకు ముప్పారం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ మేరెడ్డి విజయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నిడమానూరు ఎస్ఐ గోపాల్ రావు,నిడమానూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంకతి సత్యంలకు మంగళవారం శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం పలుకుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చెరక శ్రీను,దేవస్థానం మాజీ చైర్మన్ మేరెడ్డి వెంకటరమణలు వారికి ఆహ్వాన పత్రిక ను అందజేశారు.ఈ కార్యక్రమంలో మైసయ్య, సత్యనారాయణ, వీరేశం, యాదగిరి,వెంకటేశ్వర్లు,తదితరులు ,పాల్గొన్నారు.



## ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువులు అందజేత

హుజూర్ నగర్, మార్చి 19 (ప్రజా జ్యోతి): వరల్డ్ ప్రాణిక్ హీలింగ్ అర్హటిక్ యోగ ఫౌండర్,ప్రపంచ ఆధ్యాత్మిక గురువు "మాస్టర్ చోవా కొక్ సూయి" మహా సమాధి రోజు సందర్భంగా ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యవసర కులు సరుకులు అందజేశారు. మంగళవారం సూర్యాపేట, హుజూర్నగర్ సెంటర్ వారి ద్వారా హుజూర్ నగర్ లోని జీవ్వీ అనాథ ఆశ్రమానికి 25 కేజీ ల బియ్యం ,15 కేజీ ల నూనె డబ్బా, సబ్బులు బంజారా కాలనీ వాసులకు అన్నదానం చేయడం జరిగింది. 20 రోజుల క్రితంజరిగిన ప్రమాదంలో గాయపడి పనికి వెళ్లలేని పరిస్థితిలో ఉన్న తిలక్ నగర్ కు చెందిన సుతార్ మేస్త్రి కొలుకులపల్లి. సుధాకర్కుటుంబానికి 25 కేజీల బియ్యం దానం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ సభ్యులు రామకృష్ణ, రాజేష్, అంజయ్య , వెంకటేశ్వర్లు, కనకారావు, శ్రీనివాస్, ఒపెన్ ఐస్ సొసైటీ ప్రధాన కార్యదర్శిలువ శ్రీను, డి ఎస్ ఆర్ ట్రస్ట్ చైర్మన్ బాబురావు , జీవ్వీ అనాధ బాలల ఆశ్రమనిర్వాహకులు ధన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి పూజలు



హుజూర్ నగర్, మార్చి 19 (ప్రజా జ్యోతి): మండలంలోని బూరుగడ్డ గ్రామంలో గల శ్రీ ఆది వరాహ లక్ష్మి నరసింహ వేణుగోపాల స్వామి దేవాలయం నందు మంగళవారం క్షేత్రపాలకుడు శ్రీ ఆంజనేయ స్వామి" వారికి పంచామృత అభిషేకము, 108 తమల పాకులచే ఆకుపూజ, గంధ సింధూరము, పానకం, వడపప్పు, పండ్లు, నారికేళము, పులిహోర, వడమాల, ప్రసాద నివేదనలతో పూలదండ అలంకరణ సహిత పూజా కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, ఆలయ చైర్మెన్ గండు సైదులు, ఆలయ అర్చకులు ముదుంబై హరీష్ కుమారా చార్యులు, ముదుంబై మనోహరాచార్యులు, యరగాని పూర్ణ, పోరాల్ల వీరబాబు, ఆలయ సిబ్బంది జి. గోవింద్ రెడ్డి, వై. కిరణ్ గౌడ్, వై. రమేష్, వై. ఉపేందర్, అధిక సంఖ్యలో భక్తులు, భక్తురాండ్లు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా ఇసుక రవాణా టిప్పర్ పట్టివేత

గరిడేపల్లి మార్చి 19(ప్రజా జ్యోతి): అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ ను ఎస్సై ఈటె సైదులు పట్టుకున్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్టీఆర్ జిల్లా నుండి సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామం వరకు వచ్చిన టిప్పర్ ను గ్రామ శివారులో పట్టుకున్నారు.ఈ టిప్పర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై ఈటే సైదులు తెలిపారు.



## ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను సీజ్ చేసిన ఎస్ఐ పి,వీరబాబు



పెద్దపూర మార్చి 19 ( ప్రజా జ్యోతి ) మండల కేంద్రంలోని అక్రమంగా ఇలాంటి పర్మిషన్ లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని పెద్దపూర ఎస్ఐ పి వీరబాబు సీజ్ చేశారు ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది పెద్దగూడెం గ్రామానికి చెందిన మర్రి పరమేష్ అక్రమంగా ఇసుకను రాత్రిపూట తలుస్తుండగా పట్టుకున్నట్లు తెలియజేశారు, అనుముల మండలానికి చెందిన రావుల వెంకటయ్య అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ఎస్ఐ పట్టుకుని రెండు టాక్టర్లను సీజ్ చేయడం జరిగింది అని తెలిపారు.

## రెడ్డి కార్పొరేషన్ చైర్మెన్ పదవి రెడ్డి సంఘం నాయకులకు ఇవ్వాలి

పెద్దపూర మార్చ్ 19(ప్రజా జ్యోతి)పేద రెడ్డిల హక్కుల కోసం పోరాటం చేసిన రెడ్డి సంఘం నాయకులకు గ్రామ స్థాయి లో పేద రెడ్డిల సాధక బాధల పైన వారికి అవగాహన ఉన్నది మొన్న జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి రెడ్డిల మద్దతు ఇవ్వడంలో కీలక పాత్ర పోషించారు కాబట్టి రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ గా రెడ్డి సంఘం నాయకులకి ఇవ్వాలి అని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నాం .. ఈ కార్యక్రమంలో సల్ల హనుమంత్ రెడ్డి, మూల నర్సి రెడ్డి, తుమ్మలపల్లి సుధాకర్ రెడ్డి, కుక్కల కృష్ణ రెడ్డి, కందుల రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.